నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 20 ఏప్రిల్ 2025 SANGAREDDY

## క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే నివారించవచ్చు



సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

సిద్దిపేట, ఏప్రిల్19: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే నివారించవచ్చని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి ఆడిటోరియంలో కిమ్స్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర దేశాల కంటే మన దేశంలోనే క్యాన్సర్ రోగుల సంఖ్య ఎక్కువగా పెరుగుతుందన్నారు. ప్రతి పదిమంది పేషంట్లను పరీక్షిస్తే ఇద్దరు లేదా ముగ్గురికి క్యాన్సర్ ఉంటుందన్నారు. వైద్యరంగంలో ఎన్నో విజయాలు సాధించినప్పటికీ క్యాన్సర్‌ను పూర్తిగా జయించలేకపోయమన్నారు. క్యాన్సర్ అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందన్నారు. మధ్యవయస్సు వారందరూ తప్పకుండా తరచూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో ఇలాంటి క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ముందుకు వచ్చి ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు.సిద్దిపేటలో కిమ్స్ దవాఖాన వారు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.వైద్యులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, దేవరశెట్టి మధు, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరామ్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పూజల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# తల్లిదండ్రులు, గురువులను మర్చిపోవద్దు

- నేటి భద్రతే.. రేపటి భవిష్యత్‌కు ఎదుగుదల
- విద్యార్థులకు జీవిత పాఠాలు కూడా నేర్పాలి
- "భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి" కార్యక్రమంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఓ విద్యార్థిని మాటలకు కంటతడి పెట్టిన మాజీ మంత్రి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 19 : విద్యార్థులకు కేవలం మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదని జీవిత పాఠాలు కూడా నేర్పించాలని నాడు మహాత్మాగాంధీ సూచించినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. జీవితంలో తల్లిదండ్రులు, గురువులు, మనం చదివిన పాఠశాలను ఎప్పుడూ మర్చిపోవద్దన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మెట్రో గార్డెన్‌లో "భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి" అనే పేరుతో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు వేసవిలో పాటించాల్సిన కొన్ని ముఖ్య విషయాలపై వివరించారు. తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఎలా ఉండాలి.. వారిని ఎలా గౌరవించాలి.. గురువులను ఎలా గౌరవించాలి తదితర అంశాలపై మోటివేషనల్ స్పీకర్ రంజిత్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంత ఎదిగితే ఉపాధ్యాయులు అంత ఉప్పొంగుతారని, తమ కంటే తమ శిష్యులు ఉన్నత స్థానంలో ఉండాలని ఆశపడతారన్నారు. నేటి భద్రతనే రేపటి భవిష్యత్ ఎదుగుదల అన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ, రీల్స్ చూస్తూ సమయాన్ని దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. వేసవి సెలవుల్లో చెరువులు, ప్రాజెక్టులు, కాలువల వద్ద ఈతకు వెళ్లవద్దని సూచించారు. చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పకుండా ఈతకు వెళ్లి చనిపోవడం ఈ మధ్య చాలా చూస్తున్నామన్నారు. తల్లిదండ్రులకు చెప్పకుండా సైకిళ్లు, బైక్‌లు నడపవద్దని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఇద్దరు చిన్నారులు కారులో ఆడుకుంటూ ఊపిరాడక చనిపోయారని, ఎక్కడికి వెళ్లినా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. విలువైన ఈ వేసవి కాలాన్ని స్టేజీ ఫియర్‌ను అధిగమించడం, పుస్తకాలు చదవడం, డ్యాన్స్, మ్యూజిక్ లాంటివి నేర్చుకోవడం, తల్లిదండ్రుల పనుల్లో సాయం చేయడం వంటివి చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సిద్దిపేట ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాన్ని హరీశ్‌రావు అభినందించారు. అనంతరం "భద్రంగా ఉండాలి.. భవిష్యత్‌లో ఎదగాలి" కరపత్రాలను ఆయన ఆవిష్కరించి.. విద్యార్థులకు పలు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


సిద్దిపేటలో విద్యార్థిని సాత్వికను ఓదారుస్తూ కంటతడి పెడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు


సిద్దిపేటలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పాఠశాలల ప్రతినిధులు


సిద్దిపేటలో విద్యార్థిని సాత్వికను ఓదారుస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

### కంటతడి పెట్టిన హరీశ్‌రావు

విద్యార్థులకు ముందుగా రంజిత్ అనే మోటివేషనల్ స్పీకర్ తల్లిదండ్రులను ఏ విధంగా గౌరవించాలి.. ఎలా విలువ ఇవ్వాలి.. తల్లిదండ్రులు చెప్పిన మాటలు ఎందుకు వినాలి.. వంటి విషయాలు విద్యార్థులకు వివరించారు. ఇందులో భాగంగా కొందరు విద్యార్థులు తమ స్పందనను తెలియజేస్తూ ఇకపై తమ తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టమని, వారిని గౌరవిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాత్విక మాట్లాడుతూ.. తాను రెండో తరగతిలో ఉన్నప్పుడు నాన్న చనిపోయాడని, తన అమ్మే అన్ని బాగోగులు చూసుకుంటుందని, ఈరోజు తాను చదువుకుంటున్నానంటే అమ్మ కష్టార్జితమని బోరున విలపించింది. దీంతో మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా తీవ్ర భావోద్వేగానికి లోనై కంట తడి పెట్టారు. దీంతో సభలో ఉన్నవాళ్లంతా భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం సాత్వికను తన దగ్గరకు ఆత్మీయంగా పిలిపించుకొని హరీశ్‌రావు ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మాజీ ఏఎంసీ చైర్మన్లు పాల సాయిరామ్, ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చిన్నా, వేణుగోపాల్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు
# దండులా కదిలిరావాలి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**


సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,ఏప్రిల్19 : వరంగల్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు దండులా కదిలిరావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని జీఎల్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ స్థాపించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వ మే..మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో స్వర్ణయుగమని,అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే హామీలను తుంగ లో తొక్కి, ఆరు గ్యారెంటీలను విస్మరించిందన్నారు. ఉద్యమాల గడ్డ ..బీఆర్‌ఎస్ అడ్డా దుబ్బాక నియోజకవర్గం నుంచి వేల సంఖ్యలో కదలి వచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్‌ఎస్ ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటేందుకు ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆయన కార్యకర్తకు సూచించారు. దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రతి ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా దుబ్బాక నియోజకవర్గం నుంచి ఆధిక్యం ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎన్నికలు ఎప్పుడైనా గులాబీ జెండాఎగరడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ,మాజీ జడ్పీటీసీ యాదగిరి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు పర్వేజ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌గౌడ్,యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్,కల్లూరి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక సంఘాల సమ్మెకు బీఆర్‌ఎస్ మద్దతు


సిద్దిపేటలో కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

- ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేటలో కార్మిక సంఘాల సదస్సు

సిద్దిపేట,ఏప్రిల్19: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు బీఆర్‌ఎస్ పక్షాన మద్దతు తెలియజేస్తున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్మిక సంఘాల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల శ్రమ, చెమట చుక్కలు లేకపోతే ఈ ప్రపంచమే నడవదని...అలాంటి కార్మికులపై కేంద్రం వైఖరి చాలా దుర్మార్గంగా ఉందన్నారు. 50 శాతం మంది కార్మికులు అంగీకరిస్తేనే యూనియన్ పెట్టాలనే కేంద్రం కొత్త కార్మిక వ్యతిరేక నిబంధనలు పెట్టిందన్నారు. బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి తీసుకున్న రూ. 16 లక్షల 50వేల కోట్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. కానీ కార్మికులకు రూ.16 వేల జీతం ఇవ్వమంటే... రైతులకు రుణమాఫీ చేయమంటే, కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించమంటే చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయమంటే పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు అండగా ఉండాల్సిన కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు కార్మికుల కోడ్స్ తీసుకురావడం దారుణమన్నారు. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తెచ్చి కర్షకుల ఉసురు పోసుకుందన్నారు. ఆనాడు దేశంలోని రైతులంతా ఒక్కటై ఢిల్లీని ముట్టడించి ఏడాదిపాటు సమ్మె చేసి చివరకు కేంద్రం మెడలు వంచారని గుర్తుచేశారు. రైతు వ్యతిరేక చట్టాలను నిలిపివేయించిన ఘనత రైతులదేనన్నారు. రైతులు చూపిన ఐక్యతను కార్మికులు కూడా చూపించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ఆధీనంలోని ఈఎస్‌ఐ దవాఖానల్లో మందులు లేవు, వైద్యులు లేరన్నారు. పీఎఫ్ రాకుంటే కార్మిక కుటుంబాలు ఎట్లా జీవనం కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు.బీఆర్‌ఎస్ హయాంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్ల జీతాలు పెంచామన్నారు.కాంగ్రెస్, బీజేపీ ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.18 వేల వేతనాలు ఇస్తామని చెప్పి, జీతాలు పెంచుతామని మాట ఇచ్చి అధికారంలోకి రాగానే హామీ ఇచ్చిన విషయాన్ని మర్చిపోయారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పి ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామంటే పర్మిషన్లు ఇవ్వడం లేదన్నారు. వేతనం పెంచమని అడిగితే ఆశవర్కర్లపై దాడిచేసి కొట్టించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కార్మిక చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. బీడీ కార్మికుల కష్టాలు తెలిసిన కేసీఆర్ వారికి నెలకు రూ.2 వేల పింఛన్ ఇచ్చారన్నారు. దేశంలో బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్మికు సంఘాల నాయకులు,బీఆర్ ఏటీయూ అధ్యక్షుడు రాంబాబు,బాలరాజు, మల్లారెడ్డి, మందపవన్, గోపాలస్వామి, పిండి అరవింద్, లక్ష్మణ్, నర్సింహులు, పాలసాయిరామ్, వేణుగోపాల్‌రెడ్డి,బీఆర్ టీయూ నాయకులు శ్రీనివాస్, శోభన్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి


# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి**

జిన్నారం, ఏప్రిల్ 19: వరంగల్ జిల్లాలో ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలోని పులిగిల్ల ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన జిన్నారం మండలం బొల్లారం, గడ్డపోతారం మున్సిపాలిటీల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాధనే ధ్యేయంగా ఆవిర్భవించిన బీఆర్‌ఎస్ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిన్నారం మండలం నుంచి 400 మంది, బొల్లారం మున్సిపాలిటీ నుంచి 300 మందిని వాహనాల్లో తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్‌ఎస్‌కు అడ్డా అని గుర్తుచేశారు. మూడు సార్లు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పార్టీ మారినంత మాత్రాన పార్టీ బలహీన పడదన్నారు. పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచారన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసి సత్తా చాటుతామన్నారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ కార్యకర్తలను గ్రామాల్లో ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. రాష్ట్ర యువత నాయకుడు వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ... మళ్లీ కేసీఆర్ వస్తేనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం వరంగల్ సభ పోస్టర్‌ను ఆదర్శ్‌రెడ్డి ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు సోమిరెడ్డి, అంజయ్య యాదవ్, పృథ్వీరాజ్, మణిక్ యాదవ్, రాజేశ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ) : ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఆయన సన్నబియ్యం సరఫరా, యాసంగి ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నర్సాపూర్ ఆర్టీవో కార్యాలయం నుంచి మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, పౌర సరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. వానకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా యాసంగి పంట సజావుగా కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయాలన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరుతో కోతలు లేకుండా కొనుగోలు చేసేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అనుగుణంగా జిల్లాల్లో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో ఎక్కడైనా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పరికరాల కొరత ఉంటే తక్షణమే కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు.

### ఇబ్బందులు రాకుండా చర్యలు: కలెక్టర్

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కొనుగోలు సన్నద్ధతపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బీ గ్రేడ్ రకానికి రూ.2300 సూచించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 50 శాతం కొనుగోలు కేంద్రాలు మహిళా సమాఖ్యలకు కేటాయిస్తున్నామని, గ్రామ సమాఖ్యలకు ధాన్యం కొనుగోలుపై డీఆర్డీఏ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో షామియానాలు, తాగునీరు, ప్యాడీ క్లీనర్, మాయిశ్చర్స్, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, వేసవి దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం విడి విడిగా కొనుగోలు చేసేందుకు వీలుగా మార్కింగ్ చేయనున్నట్లు తెలిపారు.


హాజరైన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు

# బీఆర్‌ఎస్‌లో చేరికలు

చేగుంట,ఏప్రిల్19:ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా నార్సింగిలో కాంగ్రెస్ నాయకుడు, నార్సింగి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తాటికొండ సిద్దు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని సిద్దు తెలిపారు.దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు,నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నార్సింగి మండల అధ్యక్షుడు మైల రాంబాబు,మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ చిందం సబితారవీందర్,బాణాపురం కృష్ణారెడ్డి,సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి,సిద్ధిరాములు,మల్లమ్మ ఎల్లయ్య,భిక్యానాయక్,సత్యం, చిన్న్య, శ్రీపతిరావు,ఆకుల మల్లేశంగౌడ్,విష్ణువర్ధన్‌రెడ్డి, భూపతి, లాలు,వాయిద్,ఇండ్ల శ్రీనివాస్,మాజీ సర్పంచ్ చెప్యాల మల్లేశం,శ్రీనివాస్ పాల్గొన్నారు.


మెదక్ జిల్లా నార్సింగిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు తాటికొండ సిద్దు

# రైతన్న ఆగమాగం

- మెదక్ జిల్లాలో 1900 ఎకరాల్లో వరి పంట నష్టం
- ఈదురుగాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో వరి, మొక్కజొన్న రైతులు

మెదక్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో రైతుల పరిస్థితి ఆగమాగమవుతోంది. పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలు రైతున్నకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఒక వైపు అకాల వర్షాలు.. మరో వైపు ఎండలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోయి ఒక వైపు.. వడగండ్లతో వరి పంట రాలిపోయింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో 1900 ఎకరాలకు పైగానే పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, చేగుంట, చిన్నశంకరంపేట తదితర మండలాల్లో కోతకు వచ్చిన వరి పంట వడగండ్ల వానతో పూర్తిగా నేలమట్టమైంది. వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడి తోటలు సైతం అకాల వర్షం వల్ల నష్టపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. వర్షాలతో 2వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పొలాలను పరిశీలించి రైతుల వారీగా వరి పంట నష్టం వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు.

### యాసంగి పంటల సీజన్‌లో భారీ నష్టం

యాసంగి పంటల సీజన్‌లో అకాల వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. మెదక్ జిల్లాలో రైతులను తీవ్రంగా కుంగదీసింది. అక్కడక్కడా కురిసిన అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ఆదిలోనే ఆటంకం ఎదురైనట్లుగా మారింది. ఊహించని విపత్తుతో కొంత మంది రైతులను కోలుకోకుండా చేసింది. ఏపుగా ఎదిగిన వరిపంట నేలవాలి పూర్తిగా పనికి రాకుండా పోయింది. దెబ్బతిన్న పంటలను చూసి రైతులు కన్నీరుపెట్టుకుంటున్నారు.


మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం సీతారాంపూర్‌లో దెబ్బతిన్న వరి పంటను చూపిస్తున్న రైతు